ప్రజాశక్తి

శనివారం 17 ఆగస్టు 2024

5

అల్లూరి సీతారామరాజు

పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి- చింతపల్లి : పారిశుద్ధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయమని స్థానిక సర్పంచి దురియా పుష్పలత కొనియాడారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఎన్డీఏ కూటమి నాయకులతో కలసి ఆమె స్థానిక పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు అందజేశారు. గ్రామంలో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా వారు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రజలంతా పారిశుద్ధ్య కార్మికులకు సహకరించాలని, ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఈ సందర్భంగా ఆమె పిలుపునిచ్చారు.

సన్మానిస్తున్న సర్పంచ్

ప్రమాదపుటంచున భవనాలు

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని పలు పాఠశాలలో శిధిల వ్యవస్థకు చేరిన పాఠశాల భవనాలను మరమ్మతు చేపట్టక పోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారాయి. మండలంలోని తీగలవలస పంచాయతీ కామయ్యపేట ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. భవనం పెచ్చులు ఊడిపోయాయి. గోడలంతా శిధిలావస్థకు చేరాయి. దీంతో, సమీపంలో ఉన్న భవనంలో విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాల భవనం సమీపం నుంచి విద్యార్థులు ప్రమాదం జరుగుతుందోమోనని తల్లిదండ్రులు భయ పడుతున్నారు. మండిపుట్టు, బూరుగుపుట్టులో శిధిలావస్థలో పాఠశాలలు ఉన్నాయి. శిధిల భవనాలను వెంటనే తొలగించి నూతనంగా నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అనంతగిరి:మండలంలోని కాశీపట్నం జీసిసి గొడౌన్ శిధిలావస్థకు చేరింది. భవనం ముందుభాగం పెచ్చులు విరిగిపడుతున్నాయి. ఈ భవనంలోనే పౌరసరఫరాల శాఖ పంపిణీ చేస్తున్న బియ్యం, ఇతర నిత్యావసర సరకులు నిలువ ఉంచేవారు. ఇక్కడి నుండి మండలంలోని జీసిసి డిపోలకు సరఫరా చేస్తుంటారు.
మరో కొత్త భవనం ఏర్పాటుతో ఈ భవానాన్ని ఖాళీ చేశారు. ఈ భవనంలో అటవీ ఉత్పత్తులు నిల్వ ఉంచేందుకు ఉపయోగించునేవారు. భవనం పెచ్చులు విరిగి పడండంతో నిరుపయోగంగా వదిలి వేశారు. సంతలో వచ్చిన గిరిజన ప్రజలు వర్షం కురిసిన్పుడు, ఎండ తీవ్రతకు సేదతీర్చేందుకు ఈ భవనం కిందకు వెళుతుంటారు. ఈ భవనం ప్రమాదపుటంచున ఉండటంతో ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

హుకుంపేట మండలం కామయ్యపేటలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల

అనంతగిరి మండలం కాశీపట్నంలో ఉన్న శిథిలావస్థలో ఉన్న జిసిసి గొడౌన్

డిసెంబరుకు సెల్ టవర్ల నిర్మాణాలు

కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు:జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న సెల్ టవర్ల నిర్మాణాలు డిసెంబరు నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. సెల్ టవర్ల నిర్మాణానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని సెలవర్ల నిర్మాణం ఎదురవుతున్న సమస్యలను అడిగితెలుసుకున్నారు. సెల్ టవర్ల నిర్మాణాల పురోగతిపై శుక్రవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో బిఎస్ఎన్ఎల్, జియో, ఎయిటెల్ నెట్ వర్కుల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెట్ వర్కు సదుపాయాల కల్పిస్తే టీచర్ల బయోమెట్రిక్ హాజరు, అంగన్వాడీలకు సరుకుల పంపిణీ సక్రమంగా జరుగుతుందన్నారు. బిఎస్ఎన్ఎల్ సంస్థకు 938 టవర్లు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడం జరిగిందన్నారు. 112 టవర్లకు రేడియేషన్ సదుపాయం కల్పించారని, 739 టవర్లకు రేడియేషన్ సదుపాయాలు కల్పించవలసి ఉందని ఈ పనులు ఎప్పుడు పూర్తి చేస్తారని అధికారులను ప్రశ్నించారు. పెదబయలు మండలం బూరుగుపుట్టు, మారేడిమిల్లి మండలం గుడిసె టవర్ల భూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చారు. 105 టవర్లను గ్రౌండ్ చేయవలసి ఉందని బి ఎస్ఎన్ఎల్ అధికారులు వివరించారు. ఈనెల 27న డి ఎల్ సి మీటింగ్‌లో చర్చించి సమస్యలను పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ అన్నారు. జియో టెలికాం సంస్థకు 465 టవర్లు కేటాయించామని 396 టవర్లకు రేడియేషన్ సదుపాయం కల్పించారన్నారు. 739 టవర్లకు రేడియేషన్ కల్పించి వినియోగంలోకి తీసుకుని రావాలని సూచించారు. 29 టవర్లు పూర్తి చేసారని మరో 25 గ్రౌండింగ్ చేయాలన్నారు. అక్టోబరు నాటికి పూర్తి చేస్తామని జియో అధికారులు జిల్లా కలెక్టర్ కలెక్టర్కు వివరించారు.ఎయిర్ టెల్ 112 టవర్లకు 107 టవర్లుకు రేడియేషన్ సదుపాయం కల్పించారని, ఐదు టవర్లు రేడియేషన్ సదుపాయం ఆగస్టులోగా పూర్తి చేస్తామని ఎయిర్ టెల్ అధికారులు జిల్లా కలెక్టర్కు వివరించారు. కేబుల్ లైన్లు పటిష్టంగా వేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్, బిఎస్ఎన్ డిజియం (ప్రాజెక్టులు) ఆర్. శ్రీకాంత్ పట్నాయక్, డిజిఎం (ఇబి, టిఎస్) ఎం. సత్య ప్రసాద్, ప్రాజెక్సు డి.ఇకె.వి.బి గంగాధర్, జియో అధికారులు సత్య, సూర్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

వీరన్నపడాల్‌ను పరామర్శిస్తున్న నాయకులు

వీరన్నపడాల్‌కు పరామర్శ

ప్రజాశక్తి - చింతపల్లి:అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలో చికిత్స పొంది ఇంటి వద్ద ఉన్న చింతపల్లి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి వీరన్న పడాల్ (బాబులు)ను ఆ పార్టీ నాయకులు పరామర్శించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు లకే వెంకటరమణ, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సాగిన కృష్ణపడాల్ పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి రాష్ట్ర కో ఆర్డినేటర్ వంతల గోపీనాథ్, పార్టీ సీనియర్ నాయకుడు బొరుబోజి సన్యాసి దొర, డివిజన్ అధ్యక్షుడు మోహన్, సోషల్ మీడియా కన్వీనర్ రీమల రాజేష్, కొర్ర నాగేశ్వరరావు, గెమ్మెల రామచందర్ పాల్గొన్నారు.

రష్యాలో ఎత్తైన ఎల్‌బ్రోస్ పర్వత శిఖరంపై సీలేరు యువకుడు సాయితేజ

రష్యాలో ఎత్తైన శిఖరాన్ని అధిరోహించిన సీలేరు యువకుడు

ప్రజాశక్తి-సీలేరు

రష్యాలోని ఎత్తైన శిఖరం ఎల్‌బ్రోస్ పర్వతాన్ని జీకే వీధి మండలం సీలేరుకు చెందిన మలసాల శ్రీను కుమారుడు సాయితేజ అనే యువకుడు అధిరోహించాడు. యూరప్ దేశాల్లో అత్యధిక ఎత్తైన పర్వతంగా పేరుగాంచిన రష్యాలోని ఎల్‌బ్రోస్ పర్వత్వం ఎత్తు 18,500 కాగా, దానిని సాయితేజ ఆవరోధించి అక్కడ భారతీయ జాతీయ పతాకాన్ని చేతబట్టి దేశ గౌరవాన్ని చాటాడు. బూట్స్ అండ్ క్రోమ్ వన్ ఆర్గనైజింగ్ తరపున ఇండియా నుంచి 20 మంది రష్యా దేశంలో ఎల్‌బ్రోస్ పర్వతాన్ని అధిరోహించడానికి వెళ్లారు. ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల నుంచి వెళ్లిన ఈ బృందంలో సీలేరు చెందిన సాయి తేజ కూడా ఉన్నారు. సాయితేజ డిగ్రీ చదివి ఎన్‌సిసిలో ఏ గ్రేడ్‌లో నిలిచారు. ఎల్బ్రోస్ పర్వతం 18,500 అడుగులు ఎక్కడానికి ఆరు రోజులు సమయం పట్టిందని, ఈ పర్వతాన్ని ఆరాధించడం ఎంతో అనుభూతిని కలిగించిందని సాయితేజ తెలిపారు. తాను చిన్నతనం నుంచి అనుకున్న పర్వతారోహణ కల నెరవేరిందని సాయి తేజ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దులో ఉన్న సీలేరు కుర్రోడు యూరప్ దేశంలో అత్యంత ఎత్తైన పర్వతం అధిరోహించడం పట్ల సామాజిక మాద్యమాల్లో సాయితేజకు అభినందనలు వెల్లువెత్తున్నాయి.

వైద్య సేవలు అందిస్తున్న వైద్యాధికారి హిమబిందు, వైద్య సిబ్బంది

తోకరాయిలో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి-సీలేరు

జికె.వీధి మండలం, ధారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి తోకరాయి గ్రామంలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి డాక్టర్ డీకే హిమబిందు గ్రామంలో 93 మందికి సాధారణ వైద్య తనిఖీలు నిర్వహించారు. 20 మంది జ్వర బాధితులకు రక్తపూతల సేకరించి పరీక్షలు నిర్వహించారు. జ్వర బాధితుల్లో మలేరియా నిర్ధారణ కాలేదు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో జ్వరాలు, అతిసార ప్రబలుతున్నాయని, సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వర బాధితులు ఆసుపత్రికి వచ్చి రక్త పరీక్ష చేయించుకోవాలని, మలేరియా నిర్ధారణ జరిగితే క్రమంగా మందులు వాడాలని కోరారు. గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గర్భిణులు ఆసుపత్రిలోనే ప్రసవం పొందాలని సూచించారు. గిరిజనులు పసర మందులు, నాటు వైద్యానికి దూరంగా ఉండాలని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ రాణి, ఎంపీహెచ్ఈవో పోతురాజు, ఏఎన్ఎం శోభ పాల్గొన్నారు.

గర్భాశయంలో కణితి తొలగింపు

ఏరియా ఆసుపత్రిలో గిరిజన మహిళకు శస్త్ర చికిత్స

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం ఓ గిరిజన మహిళకు గర్భాశయంలో కణితి ఉండడంతో గుర్తించిన వైద్యులు ఆమెకు ఆపరేషన్ చేసి దానిని తొలగించారు. ఎటపాక మండలం లక్ష్మీపురం పీహెచ్‌సీ పరిధిలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన ఇరపా రాములమ్మ అనే గిరిజన మహిళకు గర్భాశయంలో పది సెంటీ మీటర్ల సైజులో కణితి ఉంది. దీంతో ఈమెకు శస్త్రచికిత్స అవసరమని గుర్తించిన పీహెచ్‌సీ వైద్యులు చింతూరు ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఏరియా ఆసుపత్రి గైనకాలజిస్టులు కడుపులో కుడి వైపున ఓవరెన్ సిస్ట్ ఉందని, ఈమెకు వెంటనే ఆపరేషన్ చేయాలని తెలిపారు. శుక్రవారం చింతూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్, మత్తు వైద్యులు డాక్టర్ ఎంవీ కోటిరెడ్డి నేతృత్వంలో గైనకాలజిస్టులు డాక్టర్ వైవీ రమణారావు, డాక్టర్ శశికళ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించి కణితిని తొలగించారు. ప్రస్తుతం రాములమ్మ ఆరోగ్యం నిలకడగా ఉందని సూపరింటెండెంట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ కుమారి, వినయ్, కనకమ్మ పాల్గొన్నారు.

గర్భాశయం నుండి తీసిన కణితి

సీలేరులో మంచు తీవ్రత

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో మంచు తీవ్రత అధికంగా ఉంది. వారం రోజుల నుంచి పగటి పూట ఎండ తీవ్ర అధికంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారు. అదే సమయంలో రాత్రి సమయంలో శీతల వాతావరణం నెలకొంటుంది. శీతాకాలాన్ని తలపించే విధంగా సీలేరు పరిసర ప్రాంతాల్లో దట్టంగా మంచు కురుస్తుంది. ఉదయం 7 గంటల వరకు మంచు తెరలు వీడడం లేదు. వాతావరణంలో భిన్న మార్పులు చోటుచేసుకోవడంతో అనేకమంది వైరల్ ఫీవరు, ఇతర సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు.

సీలేరులో దట్టంగా కురుస్తున్న పొగ మంచు

కురుస్తున్న వర్షం

పాడేరులో భారీ వర్షం

ప్రజాశక్తి-పాడేరుటౌన్:అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సాధారణ వాతావరణం కొనసాగింది. ఆ తర్వాత నుంచి ఆకాశం మేఘవృతమై వాతావరణంలోని మార్పులు చేసుకున్నాయి. దీంతో, కారు మబ్బులు కమ్ముకొని ఒక్కసారిగా భారీ వర్షం మొదలైంది. పట్టణంలో వీధులన్నీ తడిసి ముద్దయ్యాయి.సాయంత్రం నాలుగున్నర గంటల వరకు వర్షం కురుస్తూనే ఉంది. భారీ వర్షానికి పట్టణంలోని రోడ్లన్నీ జలమయం కాగా పంట పొలాల్లోకి వర్షం నీరు భారీగా చేరింది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు.

మాట్లాడుతున్న సూపరింటెండెంట్

సమాజంలో పాత్రికేయుల పాత్ర కీలకం

-ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభావతి

ప్రజాశక్తి-చింతపల్లి:సమాజంలో పాత్రికేయుల పాత్ర కీలకమని నూతనంగా బాధ్యతలు చేపట్టిన స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభావతి తెలిపారు. నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి తో కలిసి ఆమె పలువురు స్థానిక పాత్రికేయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,పాలకులు, అధికారులు, ఉద్యోగులు ఏ కార్యక్రమం చేపట్టినా ప్రజలకు చేర వేస్తున్నారన్నారు. అటువంటి పాత్రికేయ వ్యవస్థను గౌరవించు కోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది అందిస్తున్న మెరుగైన వైద్య సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు పాత్రికేయుల సహకారం తమకెంతో అవసరమన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక నగదు ప్రదానం

ప్రజాశక్తి -కొత్తకోట:గత మార్చి లో జరిగిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మెరిట్ సాధించిన విద్యార్థులకు ఎక్కల దేవి చెల్లయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు పరిదేశీ ప్రోత్సాహక బహుమతులు అందించారు. కొత్తకోట పి యస్ ఆర్ ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ.4వేల చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని హెచ్ఎం నాగేశ్వరరావు చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్ర మంలో గ్రామ సర్పంచ్ కొన లోవరాజు, డిసిఎంఎస్ మాజీ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ్ పాల్గొన్నారు.

అధికారులకు ఉత్తమ సేవా పురస్కారాలు

ఎమ్మెల్యే నుండి పురస్కారం అందుకుంటున్న సత్యనారాయణ

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అధికారులకు ఉత్తమ సేవా పురస్కారాలను గురువారం అందజేశారు.

రాజవొమ్మంగి : రాజవొమ్మంగి మండల డిప్యూటీ తాహశీల్దార్ అల్లు సత్యనారాయణ ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆయనకు గురువారం రంపచోడవరం ఐటిడిఎ కార్యాలయంలో ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ ఎస్ ప్రశాంత్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందజేశారు. విధి నిర్వహణలో విశేష ప్రతిభ కనబర్చినందుకుగాను ఈ ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా డిటి సత్యనారాయణను తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

దేవీపట్నం : మండలంలో ఎన్ఆర్ఇజిఎస్ ఏపీవోగా పని చేస్తున్న లక్ష్మీనారాయణ ఉత్తమ సేవా ప్రశంసా పత్రాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ చేతుల మీదుగా గురువారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఏపీవో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తనకు ఉత్తమ సేవా ప్రశంసా పత్రం రావడం చాలా ఆనందంగా ఉందన్నారు.

ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న లక్ష్మీనారాయణ

అవార్డును అందుకుంటున్న ఎస్ఐ వెంకటరమణ

తన తోటి ఉద్యోగులు అందించిన సహాయ సహకారాలతో ఈ సేవా పురస్కారం లభించిందని, వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

చింతపల్లి : సేవా పురస్కారానికి ఎంపిక చేయడం పట్ల సంతోషంగా ఉందని స్థానిక అదనపు ఎస్సై వెంకటరమణ ఆనందం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. ప్రతిభ, క్రమశిక్షణ, అంకితభావంతో ఉద్యోగాన్ని బాధ్యతగా నిర్వర్తిస్తే అధికారులకు మంచి గుర్తింపు లభిస్తుందని ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.

మల్లెతోట ఆశ్రమ పాఠశాల సమస్యలను పరిష్కరించాలి

ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని మల్లెతోట ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం సురేష్‌తో పాటు సంఘం నాయకులు కారం సుబ్బారావు, ధర్మల వీరభద్రం తదితరులు మల్లెతోట గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 120 మంది విద్యార్థులు ఉంటే రెండు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు తెలిపారు. ఆ మరుగుదొడ్లకు కూడా రన్నింగ్ వాటర్ లేకపోవడంతో బకెట్లతో నీటిని మోస్తున్నామని చెప్పారు. మోటర్, వాటర్ ట్యాంకులకు సక్రమంగా కనెక్టింగ్ లేకపోవడం వల్ల వంట గదికి, డైనింగ్ రూములకు సైతం నీరు అందుబాటులో లేదని తెలిపారు. తరగతి గదుల్లో గ్రీన్ బోర్డులు లేకపోవడంతో ఉపాధ్యాయుల బోధనకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు. ఈ ఆశ్రమం పాఠశాల ఉన్న గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 30 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టడం లేదని, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులను నియమించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. అనంతరం సీసం సురేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం నాడు- నేడు పేరుతో అభివృద్ధి చేసినట్లు గొప్పలు చెప్పిందని కానీ కనీస వసతులు లేని స్థితిలో పాఠశాలలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆశ్రమం పాఠశాలలు ఉన్న గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేసి వారికి ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థుల యూనిఫారంకు కుట్టు ఛార్జీలు ప్రభుత్వం కేవలం రూ.80 మాత్రమే ఇస్తుందని, ఇది ఎటూ చాలడం లేదని, రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు తెలియజేసిన పై సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలని కోరారు.

విద్యార్థులతో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సురేష్ తదితరులు

పాఠశాల మరుగుదొడ్లు ప్రారంభం

ప్రారంభిస్తున్న సర్పంచ్ దేవగున్

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో స్వచ్ఛందంగా స్వచ్ఛంద సేవ సంస్థలు కల్పిస్తున్న సేవలను ప్రతి ఒక్క విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఆరమ పంచాయతీ సర్పంచ్ కే దేవగున్ కోరారు. మండలంలోని అరమ పంచాయతీ పూలుగుడ ఎంపీపీ పాఠశాలలో అమెరికాలోని ఫ్లోరిడా సత్య కళ మిత్రబృందం ప్రేమ్ బంద్ ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో విద్యార్థుల సౌకర్యార్థం మరుగుదొడ్లను నిర్మించారు. నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను స్థానిక పంచాయతీ సర్పంచ్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన నిరుపేద పాఠశాలల్లో చదువుతున్న గిరి విద్యార్థులకు స్వచ్ఛంద సేవ సంస్థలు ముందుకు వచ్చి ఇటువంటి కనీస మౌలిక సౌకర్యాలు కల్పించడం ఎంతో ఆనందదాయకమని ఆయన చెప్పారు. విశాఖపట్నం చెందిన ఏ మన్మధరావు, శశి పట్నాయక్ ఆ పాఠశాలకు వాటర్ ఫిల్టర్ ను బహుకరించారు. పలు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విశాఖపట్నంకి చెందిన దంతులూరి ప్రభావతి ఉచితంగా భోజన ప్లేట్లను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాస్, కె.రమేష్ కుమార్, ఎస్ఎంసి చైర్మన్, వైస్ చైర్మన్‌లు బలరాం, దొబులు, కోగేశ్వర్, నీలంబర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

30 కిలోల గంజాయి స్వాధీనం

పట్టుబడిన నిందితులతో పోలీసులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని బాబుసాల పంచాయితీ జడిగూడ గ్రామంలో ఓ గృహంలో 30 కిలోల గంజాయిని ముందస్తు సమాచారంతో ఏఎస్ఐ లక్ష్మణరావు స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ సిబ్బందిని గమనించిన నిందితుడు గంజాయిని విడిచిపెట్టి పారిపోతుండగా ఏపీఎస్పీ స్పెషల్ పార్టీ పోలీసులు చేజించి తరిమి పట్టుకున్నారు.రెండు గోనె సంచులతో పట్టుబడ్డ 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని స్థానిక స్టేషన్లో ఎస్సై రవీంద్ర కు అప్పగించారు. ఈ గంజాయి విలువ సుమారు లక్ష యాభై వేలు విలువ ఉంటుందని వెల్లడించారు.

చిరు జన్మదినాన మెగా 5కె వాక్

ప్రజాశక్తి- గాజువాక : ఈనెల 22న చిరంజీవి 69వ జన్మదిన సందర్భంగా లంకెలపాలెం చిరంజీవి అభిమానుల ఆధ్వర్యంలో మెగాస్టార్ జన్మదిన వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు శుక్రవారం లంకెలపాలెం జంక్షన్ నుండి అగనంపూడి వరకు 5కె వాక్‌ను 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించి, చివరి వరకు అభిమానులతో కలిసి వాక్ చేశారు. అ సందర్భంగా చిరు ఫోటోతో ఉన్న టీ షర్టులు, టోపీలను చిరంజీవి అభిమానులకు జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందల రమణ అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ చిరు జన్మదిన వారోత్సవాల్లో అభిమానులు తనను భాగస్వామ్యం చేయడంపై ఆనందం వ్యక్తంచేసి, వారికి ధన్యవాదాలు తెలిపారు. ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యారావు, జుత్తక రాము, మడక వీరాస్వామి, కోరుకొండ అప్పారావు పాల్గొన్నారు. .

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

కలెక్టర్ దినేష్ కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- పాడేరు : రహదారి ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం మినీ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన రహదారి భద్రతా కమిటీకి అధ్యక్షత వహించిన కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఘాట్ రోడ్లలో కొమ్మలు, పొదలు తొలగించాలని, అవసరమైన చోట్ల సైనేజ్ బోర్డులు ఏర్పాటు చేయాలని పంచాయతి రాజ్, ఆర్ అండ్ బి, జాతీయరహదారుల సంస్థ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ప్రతి బోర్డర్ ప్రాంతాలలో ఎంట్రీ వైపు ఏజన్సీ కి స్వాగతం, బయటకు వెళ్లే ప్రాంతంలో ధన్యవాదాలు తెలియజేసే బోర్డులతో పాటు ఏజన్సీలో చేయదగినవి, చేయకూడనివి, స్పీడ్ లిమిట్, గిరిజనుల పట్ల మెసిలే సూచనలు, వారి జీవన విధానానికి ఆటంకం కలిగించ కూడదని తెలిపే బోర్డులు ప్రదర్శించాలని సూచించారు. జీపులు, ఇతర భారీ వాహనాల ఓవర్ లోడింగ్ నియంత్రించాలని, తద్వారా ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదాలు జరగని విధంగా (జీరో ఆక్సిడెంట్) డ్రైవ్ చేసిన డ్రైవర్లకు ప్రోత్సాహకం అందిస్తే వారు మరింత జాగ్రత్తగా ఉంటారని కలెక్టర్ సూచించారు. ఘాట్ రోడ్లలో జీపుల బదులు 30, 40 సీట్లతో మినీ బస్సులు ఏర్పాటు చేయడానికి గల అవకాశాలు పరిశీలిస్తే ఒక ప్రాంతంలో ట్రయల్ బేసిస్ లో పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాలని అందుకు అవసరమైన అనుమతులు ఇస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. వడ్డాది -పాడేరు, కొక్కిరాపల్లి ఘాట్ రోడ్, లంబసింగి - డౌనూరు ఘాట్ రోడ్లను విస్తరించడానికి ప్రతిపాదనలు నివేదించాలని కలెక్టర్ ఆదేశించారు.
ఎస్పీ అమిత్ బర్దర్ మాట్లాడుతూ, సైనేజ్ బోర్డుల ఏర్పాటుతో ప్రయాణికులు జాగ్రత్త పడతారని తెలిపారు. సమావేశంలో జిల్లా రవాణాదికారి లీలా ప్రసాద్, మోటార్ వాహనాల అధికారి రాజేష్, ఆర్ టి సి డిపో మేనేజర్ వి. శ్రీనివాసరావు, డిఎంహెచ్ఓ . జమాల్ భాషా, పంచాయతి రాజ్, ఆర్ అండ్ బి ఇఇలు కొండయ్య పడాల్, బాల సుందరబాబు, జాతీయ రహదారుల ఎఇలు పాల్గొన్నారు.

నులిపురుగుల దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

పాడేరు: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులి పురుగులు నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. పాడేరు కలెక్టరేట్ భవనంలో 20న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఈనెల 20వ తేదీ నుంచి 28వ తేదీ వరకూ పిల్లలకు మాత్రలు వేయాలన్నారు. బాలబాలికలకు నులిపురుగులు ఉన్నట్లయితే పోషకాహార లోపం, రక్తహీనతతో నీరసంగా ఉంటారని శరీరక, మానసిక ఎదుగుదల లోపాలను కలిగి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ జమాల్ భాష, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు

సమన్వయంతోనే బాల్య వివాహాల నియంత్రణ

యుక్త వయసు ఆడ పిల్లలతో సఖి గ్రూపులు : జెసి అభిషేక్

మాట్లాడుతున్న జెసి అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు : అన్ని శాఖలు పరస్పర సహకారం సమన్వయంతోనే బాల్య వివాహాలు నియంతించ గలమని సంయుక్త కలెక్టర్ ఎం.జె. అభిషేక్ చెప్పారు. శుక్రవారం జేసి చాంబర్‌లో డివిజన్ స్థాయి బాల్య వివాహాల నిషేధం, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జేసి మాట్లాడుతూ, డ్రాప్ అవుట్లు, పదవ తరగతి తప్పిన వారిపై ప్రత్యేక దృష్టి సారించడంతో బాల్య వివాహాలు నియంత్రించ వచ్చున్నారు. బాల్య వివాహాలకు అవకాశమున్న హాట్ స్పాట్లను గుర్తించాలని సూచించారు. పివిటిజిలలో, మారుమూల గ్రామాలలో ఎక్కువగా ఇటువంటి సాంఘిక దురాచారాలు ఉంటాయని తెలిపారు.బాల్య వివాహాలతో కలిగే నష్టాలు, కష్టాలపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలలో 11 -14, 14 -18 మధ్య వయసు అమ్మాయిలతో ప్రత్యేకంగా సఖి గ్రూపులుగా ఏర్పాటు చేసి వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జేసి సూచించారు. ఇందులో తహసిల్దార్లు, ఎంపిడిఓలు స్థానిక ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలన్నారు. వెలుగు ద్వారా మహిళా సంఘాల సభ్యులు ఆయా గ్రామాల వారికి అవగాహన కల్పించి చైతన్యం చేయాలని సూచించారు. పోలీసు శాఖ ఆయా గ్రామాలపై నిఘా పెట్టి బాల్య వివాహాల పట్ల హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు. మాతా,శిశు మరణాలలో 18 ఏళ్ల లోపు వివాహితుల వివరాలు ఉదహరిస్తూ అవగాహన కల్పించాలని సూచించారు.
సిడిపిఓ ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూ, డివిజన్లో బాల్య వివాహాలు చేయదలచిన 12 మందిని ముందుగానే గుర్తించి బాల్య వివాహాలు నివారించామని అందులో ఏడుగురు చదువుకుంటున్నారని, ఒకరు హోం షెల్టర్ లో ఉన్నారని, మిగిలన నలుగురు వారి ఇళ్ళల్లో ఉన్నారని తెలిపారు. ఈ కమిటీ సమావేశంలో కన్వీనర్ సిడిపిఓ ఝాన్సీలక్ష్మి, సభ్యులు డిఎంహెచ్ఓ జమాల్ బాషా, డిపిఓ టి.కొండలరావు, డిఇఓ పి. బ్రహ్మాజీ, వెలుగు ఎపిడి చిన్నారావు, గ్రామ వార్డు సచివాలయాల కో ఆర్డినేటర్ జి.సునీల్, డిపిఆర్ఓ పి. గోవిందరాజులు, సర్కిల్ ఇన్స్పెక్టర్ నవీన్ కుమార్, డ్వామా పర్యవేక్షకులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో వ్యాజ్యాల సత్వర పరిష్కారం

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జితేంద్రకుమార్ మహేశ్వరి

సదస్సులో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు జస్టిస్ జితేంద్రకుమార్ మహేశ్వరి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : న్యాయస్థానాలలో వాజ్యాల పరిష్కారంలో మధ్యవర్తిత్వం ఎంతో ప్రాధాన్యతను కలిగి ఉంటుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జితేంద్రకుమార్ మహేశ్వరి అన్నారు. శుక్రవారం సాయంత్రం 'మీడియేషన్ ఏజ్ ఏన్ ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ సెటిల్‌మెంట్ ప్రోసస్' అనే అంశంపై ఆంధ్రవిశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ న్యాయ కళాశాలలో ఏయూ న్యాయ కళాశాల విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రాచీన కాలం నుంచి మధ్యవర్తిత్వానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. కార్మిక చట్టాలలో మధ్యవర్తిత్వం వినియోగించే విధానాన్ని వివరించారు.. తాను న్యాయవాద వృత్తిలో అడుగిడిన తొలినాళ్ళలో కుటుంబ వివాదాల వాజ్యాల సంఖ్య పరిమితంగా ఉండేదని, నేడు వేలకు చేరుకుందన్నారు. మధ్యవర్తిత్వంతో న్యాయస్థానాలకు వచ్చే విభిన్న వాజ్యాలను .సమర్ధవంతంగా, వేగవంతంగా పరిష్కరించవచ్చన్నారు. 2023లో వచ్చిన మీడియేషన్ చట్టంలో గోప్యత, శిక్షణ, కాలం, సకాలంలో పరిష్కారం చూపడం అనే అంశాలకు ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. వివాదంలో ఉన్న రెండు పార్టీలు తమ జ్ఞానాన్ని వినియోగిస్తే మధ్యవర్తిత్వంద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు మధ్యవర్తిత్వం వలన న్యాయవాదులకు, వృత్తికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని స్పష్టం చేశారు. దీనిపై న్యాయవాదులు ఎటువంటి అపోహలు, భయపడాల్సిన అవసరం లేదన్నారు.భవిష్యత్ న్యాయవాదులుగా మారే నేటి యువ విద్యార్థులు చదవడం, రాయడం, చర్చించడం, ఆలోచన చేయడం, అవగాహన చేసుకోవడం అనే ఐదు అంశాలకు ఎంతో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తన జీవితంలో విద్యార్థి దశలో జరిగిన పలు సంఘటనలు వివరిస్తూ తాను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఎదిగిన విధానం తెలియజేశారు.
ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణ రావు మాట్లాడుతూ దేశానికి అవసరమైన న్యాయమూర్తులను, న్యాయ నిపుణులను, సమాజానికి ఉపయుక్తంగా ఎందరో నాయకులను అందించిన విధానం వివరించారు ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం మాట్లాడుతూ సభకు జస్టిస్ జితేంద్ర కుమార్ మహేశ్వరిని పరిచయం చేశారు. న్యాయవాదిగా, న్యాయమూర్తిగా, ఏపి హైకోర్టు న్యాయమూర్తిగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఆయన అందించిన సేవలను విద్యార్థులకు సోదాహరణంగా వివరించారు. అనంతరం వర్సిటీ తపున జస్టిస్ మహేశ్వరిని సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా న్యాయ కళాశాల ఆవరణలో జస్టిస్ మహేశ్వరి మొక్కను నాటారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా న్యాయస్థానం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, రాష్ట్ర బార్‌కౌన్సిల్ ఉపాధ్యక్షుడు క్రిష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డిఎస్ఎన్ఎల్‌యూ ఉపకులపతి ఆచార్య డి.సూర్య ప్రకాశ రావు, పలువురు న్యాయమూర్తులు, మాజీ ఉపకులపతులు, ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో నేడు వైద్య సేవలు నిలిపివేత

ప్రజాశక్తి -గాజువాక: కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచార ఘటనకు నిరసనగా దేశవ్యాప్త పిలుపుమేరకు ఈ నెల 17న శనివారం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో 24 గంటల పాటు వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు, డిజిఎం బంగారురాజు ప్రకటనలో తెలిపారు. కంటిరోగులు, ప్రజలు గమనించాలని కోరారు. అత్యవసర సేవలు తప్ప, సాదారణ అవుట్ పేషెంట్ విభాగం పనిచేయదని సూచించారు.

ఎన్నిక పత్రంపై సంతకం చేస్తున్న బొత్స సత్యనారాయణ

వైసిపికి ఊరట

- ఎమ్మెల్సీగా బొత్స ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి : ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఎన్నిక కావడం వైసిపి శ్రేణులకు కొంత ఊరటనిచ్చినట్లయింది. సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి విశాఖ జిల్లాలో పాడేరు, అరకు మినహా మిగిలిన 13 నియోజకవర్గాల్లోనూ కూటమి అభ్యర్థులు గెలిచారు. మూడు ఎంపీ స్థానాల్లో అరకు వైసిపి గెలవగా, రెండు స్థానాలు కూటమి పరమయ్యాయి. ఏజెన్సీలో వైసిపి తన రాజకీయ బలాన్ని నిలబెట్టుకున్నా, మైదానంలో ఘోరంగా దెబ్బతింది. నిరుత్సాహంలో నాయకత్వం వుండడంతో పార్టీని నడపగలిగిన నాయకుడు లేని పరిస్థితి ఏర్పడింది. ఐదేళ్లపాటు పార్టీ కార్యక్రమాల నిర్వహణ, స్థానిక సంస్థల్లో తమ పట్టుకోల్పోకుండా కాపాడుకోవడం కాస్త కష్టంగా వుంటుందని పార్టీ అధినాయకత్వం భావించింది. ఈ నేపథ్యంలోనే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా రంగంలోకి దించిన బొత్స సత్యనారాయణ ఎన్నిక కావడంతో ఆ పార్టీ కార్యకర్తల్లో కొంత ఉత్సాహం నెలకొంది.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ప్రధాన పార్టీల నాయకులతో బొత్సకు సామాజిక, రాజకీయ సంబంధాలున్నాయి. వైసిపిలో బొత్స నాయకత్వాన్ని స్వీకరించగలిగిన ముఖ్యులు వున్నారు. జివిఎంసి, జిల్లా పరిషత్ సమావేశాల్లో వైసిపి నుంచి చాకచక్యంగా మాట్లాడగలిగిన, ఇతర పార్టీల నాయకత్వంతో మంచి సంబంధాలు కలిగిన నాయకులెవరూ వైసిపిలో ప్రస్తుతం లేరు. ఇప్పుడు ఆ రాజకీయ శూన్యత బొత్స ఎన్నికతో భర్తీకానుంది. అనకాపల్లి, పెందుర్తి జనసేన ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్‌బాబు, భీమిలి టిడిపి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కాంగ్రెస్ పార్టీలో బొత్సతో కలిసి పనిచేశారు. వ్యాపార వ్యవహారాల్లో టిడిపి ఎమ్మెల్యేలతో బొత్సకు మంచి సంబంధాలున్నాయి.

మూడు సభలకు ఎన్నికైన బొత్స !

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైసిపి సీనియర్ నాయకులు, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కొత్తగా ఒక రికార్డు సాధించారు. అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ చట్టసభలు నాలుగు ఉండగా వాటిలో మూడింటి నుంచి ఆయన ఎన్నిక కావడమే ఆ రికార్డు. విజయనగరం జిల్లాకు చెందిన ఆయన పార్లమెంటు సభ్యునిగా, అసెంబ్లీ సభ్యునిగా ఈసరికే పని చేశారు. ఇప్పుడు శాసనమండలి సభ్యునిగా ఎన్నిక కావడంతో మూడు సభలకు ఎన్నికైన గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన రాజకీయ పదవులు గురించి చూస్తే విజయనగరం జిల్లా సెంట్రల్ బ్యాంక్ చైర్మన్‌గా పనిచేశారు. బొబ్బిలి పార్లమెంటు స్థానానికి 1996లో కాంగ్రెస్ అభ్యర్థిగా తొలిసారి పోటీ చేసి ఓటమి చెందారు. 1998లో మరోసారి పార్లమెంట్ మధ్యంతర ఎన్నికలు జరిగాయి అప్పుడు కూడా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. 1999లో జరిగిన పార్లమెంట్ సాధారణ ఎన్నికలలో ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి తొలిసారి చట్టసభలకు ఎన్నికై పార్లమెంట్లో అడుగు పెట్టారు. ఇక 2004లో తొలిసారిగా విజయనగరం జిల్లా చీపురుపల్లి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా అసెంబ్లీకి పోటీ చేసి విజయం సాధించారు. 2009లో మరోసారి ఇదే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ఆ తర్వాత 2014లో ఇదే నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. అసెంబ్లీ సభ్యునిగా ఇది ఆయనకు తొలి ఓటమి. 2019లో ఇదే నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 2024లో మరోసారి వైసిపి అభ్యర్థిగా ఇదే నియోజకవర్గంలో పోటీ చేసిన ఆయన పరాజయం పాలయ్యారు. ఇప్పుడు ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి స్థానిక సంస్థలకు జరిగిన శాసనమండలి ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. ఈ విధంగా మూడు చట్టసభలకు ఆయన ఎన్నికయ్యారు. రాష్ట్ర మంత్రిగా డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి మంత్రివర్గంలోనూ, ఆ తర్వాత రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి మంత్రి వర్గాలలోనూ ఆయన పని చేశారు.

జూనియర్ వైద్యురాలిపై హత్యాచారాన్ని ఖండిస్తూ..

నిరసనాగ్రహం

విశాఖ బీచ్ రోడ్డులో జూడాల భారీ ర్యాలీ
కెజిహెచ్‌లో వైద్య సేవలు బంద్
శిక్షపడేవరకూ ఉద్యమిస్తామని హెచ్చరిక
పోరాటానికి ప్రజా సంఘాల మద్దతు

ఆర్‌కె.బీచ్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జూనియర్ వైద్యులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : కొల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారాన్ని ఖండిస్తూ విశాఖలో జూనియర్ వైద్యులు భగ్గుమన్నారు. శుక్రవారం ఉదయం ఆర్‌కె బీచ్ రోడ్డులో వారంతా కదంతొక్కారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, వైద్యులకు రక్షణ కల్పించాలని పెద్దపెట్టున నినదించారు. వారి నిరసనాగ్రహంతో బీచ్ రోడ్డు ప్రాంతం హోరెత్తింది. ఆంధ్రా మెడికల్ కాలేజీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన తలపెట్టిన ఈ భారీ ర్యాలీ కాళికా టెంపుల్ నుంచి పార్క్ హోటల్ వరకూ సాగింది. అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి కెజిహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వార్డులు, అత్యవసర విభాగాల్లో అందించే సేవలకు ఎవరూ హాజరవలేదు. విశాఖ నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలపై జూడాల ఆందోళన ప్రభావం కనిపించింది. బీచ్ రోడ్డులోని నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆంధ్రా మెడికల్ కాలేజీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ టి.పృథ్వీరాజ్ మాట్లాడుతూ ఇటీవల వైద్యులపై జరిగిన క్రూరత్వ సంఘటనలు మొత్తం వైద్య వృత్తిని కదిలించాయన్నారు. బెంగాల్‌లోని మహిళా వైద్యురాలిపై జరిగిన విషాదకరమైన, అమానవీయమైన దాడి హేయమైనదన్నారు. జూనియర్ వైద్యుల కోసం జాతీయ స్థాయిలో రక్షణ చట్టం తెచ్చేవరకూ ఆందోళన కొనసాగించాలని నిర్ణయించామని తెలిపారు. జూడాలు గురువారం నుంచి అత్యవసర సేవలకూ హాజరవ్వడం లేదన్నారు. నిరసన ర్యాలీలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.జగదీశ్వరరావు, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.ప్రియాకృష్ణవేణి, డాక్టర్ ఊహ రాపేటి, డాక్టర్ వై.రాజ్ వివేక్, డాక్టర్ కె.ఖజానా, డాక్టర్ సి.నాగ కిరణ్ కుమార్, డాక్టర్ ఎం.శిరీష, డాక్టర్ ఎస్‌కె.మొయినుద్దీన్, డాక్టర్ ఎమ్‌డి.రహీమా నస్రీన్ తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం కూడా వైద్య విద్యార్థుల ఆందోళనలు కొనసాగాయి. కెజిహెచ్ ఒపి గేటు నుంచి ఆంధ్ర మెడికల్ కళాశాల వరకు పెద్ద ఎత్తున మానవహారం నిర్వహించారు. శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు.

ప్రజా సంఘాల మద్దతు

బీచ్ రోడ్డులో జూనియర్ వైద్యులు చేపట్టిన నిరసన ర్యాలీకి ఐద్వా జిల్లా కమిటీ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ మాట్లాడుతూ కొల్‌కతాలో జరిగిన తాజా ఘటన మరో నిర్భయ ఘటన అని పేర్కొన్నారు. అతి కిరాతకంగా దుండగులు జూనియర్ వైద్యురాలిని హత్య చేసినట్టు తెలుస్తోందన్నారు. మహిళలపై అత్యాచారాలు, దాడులు, హింస పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా రక్షణకు ఉద్దేశించిన చట్టాలు పటిష్టంగా అమలుకావడం లేదన్నారు. హంతకులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, జిల్లా కమిటీ సభ్యులు కె.సంతోషం, జి.మణి పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ జూనియర్ వైద్యుల ఆందోళనకు మద్దతు తెలిపింది. బీచ్ రోడ్డులో జరిగిన కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి, విశాఖ జిల్లా అధ్యక్షులు పివి.సుధాకర్,
నాయకులు రాజేష్, స్రవంతి, సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినిపై హత్యాచార ఘటనను సిఐటియు విశాఖ జిల్లా కమిటీ ఖండించింది. ఈ మేరకు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. వైద్యుల పోరాటానికి మద్దతు ప్రకటించారు. గాజువాకలో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు.

గాజువాకలో కొవ్వొత్తుల ప్రదర్శనతో నిరసన తెలుపున్న నాయకులు

ఐఎంఎ సమ్మెకు
ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మద్దతు

విఆర్.పురం : జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య సంఘటన మన దేశానికి సిగ్గుచేటని ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుష్టి జోగారావు, పూనెం వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనను ఖండిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) దేశ వ్యాప్తంగా ఈ నెల 17, 18 తేదీల్లో రెండు రోజుల దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిందని, ఆ సమ్మెకు తమ సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని పేర్కొన్నారు. రాజధాని నడిఒడ్డున ఉన్న హాస్పిటల్‌లో డ్యూటీలో ఉన్న జూనియర్ డాక్టర్‌పైనే ఇలాంటి క్రూరమైన హత్యాచారం సంఘటన జరగడం దారుణమన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు, వీడియోలు మాయం చేయడం కోసం ఆ హాస్పిటల్‌పై దాడి చేయటం, అడ్డుగా వచ్చిన డాక్టర్లు, సిస్టర్లను కొట్టడం, హాస్పిటల్ సీసీ కెమెరాలు, వైద్యా పరికరాలను ధ్వంసం చేయడం చేశారంటే వారు ఎలాంటి రౌడీ మూకలో అర్థమవుతుందని పేర్కొన్నారు. అత్యవసర సేవలు అందించే వైద్య సిబ్బందిపై ఈ రకంగా దాడి చేయడం ఇంత వరకు ఎక్కడా జరగలేదన్నారు.

ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులు

కెనరా విద్యాజ్యోతి పథకం కింద..

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కెనరా బ్యాంక్ డాక్టర్ అంబేద్కర్ విద్యాజ్యోతి స్కాలర్‌షిప్ స్కీమ్ కింద కెనరా బ్యాంక్ విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయం ఆవరణలో ఐదు నుంచి పదో తరగతి వరకూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఆరుగురికి రూ.24 వేలు చొప్పున ఉపకారవేతనాలు అందించారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంక్ విశాఖపట్నం ఎజిఎం ఎన్.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చదువుపై ఇష్టం పెంచుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. 11 ఏళ్లుగా ప్రతిభగల ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు తెలిపారు. సామాజిక సేవలో కెనరా బ్యాంక్ ఎప్పుడూ ముందుంటుందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ప్రభుత్వాల సహకారంతో ఇతర దేశాల్లో చదువుకునే వారికి విద్యా రుణాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి కె.రాజేశ్వరి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి వి.నాగశిరీష, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పలుచోట్ల తాగునీటికి అంతరాయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ (జివిఎంసి) మూడు, నాలుగు జోన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం తాగునీటికి అంతరాయం ఏర్పడుతుందని జివిఎంసి పర్యవేక్షక ఇంజినీరు కెవిఎన్.రవి తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా జివిఎంసి టిఎస్ఆర్ నుంచి హైలెవెల్ రిజర్వాయర్‌కి వచ్చే ప్రధాన మంచినీటి సరఫరా 400 ఎంఎం డయా సిఐ పైపు లైను పాడైనందున దానికి మరమ్మతులు చేపట్టనున్నారు. దీంతో 20వ వార్డులోని ఈస్ట్ పాయింట్ కాలనీ, పెదవాల్తేర్, 21వ వార్డులోని తమిళ వీధి, విద్యానగర్ కాలనీ, రెల్లి వీధి, ఎయు అవుట్ గేట్ డౌన్, ఓల్డ్ సిబిఐ డౌన్, మైత్రీ నగర్, వినాయగర అపార్టుమెంట్స్, స్విమ్మింగ్ పూల్ ఏరియా, పాండురంగాపురం, బీచ్ రోడ్ సబ్ మెరైన్, ఓషన్ వ్యూ లే అవుట్ ఏరియా, చినవాల్తేర్, ఏరియా, 22వ వార్డులోని బాలాజీ నగర్, టైమ్స్ అఫ్ ఇండియా, సిద్ధార్థనగర్, 24వ వార్డులోని పాత రేసపువానిపాలెం, వినాయకనగర్, తులసిపేట, స్వర్ణభారతి స్టేడియం ఏరియా, 27వ వార్డులోని అశోక్ నగర్, రామాటాకీస్ రోడ్డు, శ్రీనగర్, బుదిల్ పార్క్ రోడ్డు, రెడ్డి హాస్టల్ రోడ్డు, శ్రీనగర్ సాయిబాబా టెంపుల్ రోడ్డు, ద్వారకానగర్ రోడ్డు నెంబర్ 1 నుండి 6 లైన్ వరకు, అమర్ నగర్ చర్చి రోడ్డు, సిబియం కాంపౌండ్, రామాటాకీస్ లేడీస్ గేట్ బుకింగ్ రోడ్డు, 28వ వార్డులోని ఫాకర్స్ లేఅవుట్, కైలాసమెట్ట, రామ్ నగర్ ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడనుంది. ఆయా చోట్ల ప్రజలకు తాగునీటికి అసౌకర్యం కలగకుండా ట్యాంకర్లు ద్వారా మంచినీటి సరఫరా చేయనున్నట్టు రవి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో శ్రావణ శుక్రవారం పూజలు, వరలక్ష్మీ వ్రతాలు మహిళలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పండ్లు, పువ్వులు, వంటకాలు, నూతనంగా కొనుగోలు చేసిన బంగారం, వెండి వస్తువులు, ధనం లక్ష్మీదేవి ముంగిట పెట్టి పూజలు చేశారు. పూజా కార్యక్రమాలు అనంతరం ముత్తైదువులకు పిలిచి తాంబూలాలు అందజేశారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా సీలేరులోని మారమ్మ అమ్మవారి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకుని పూజలు చేశారు.